## సుదీర్ఘ కెరీర్ కు ముగింపు పలికిన భారత టెన్నిస్ దిగ్గజం

మొదటి పేజి తరువాయి

ఆటగాళ్లలో ఒకరిగా పేరుగాంచిన 45 ఏళ్ల బోపన్న, తన కెరీర్‌లో ఎన్నో శిఖరాలను అధిరోహించాడు. ముఖ్యంగా, 43 ఏళ్ల వయసులో 2024లో ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్ గెలిచి, ప్రపంచ నెం.1 ర్యాంకును అందుకొని చరిత్ర సృష్టించాడు. అంతకుముందు 2017లో గబ్రియేలా డబ్రోస్కీతో కలిసి ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను కూడా కైవసం చేసుకున్నాడు.తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘమైన, భావోద్వేగ పోస్ట్ ద్వారా వెల్లడించాడు. "జీవితానికి అర్థాన్నిచ్చిన దానికి ఎలా వీడ్కోలు చెప్పాలి? 20 ఏళ్ల మరపురాని ప్రయాణం తర్వాత, నేను అధికారికంగా నా రాకెట్‌కు విశ్రాంతినిస్తున్నాను" అని బోపన్న తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. తన ప్రయాణం కూర్గ్ అనే చిన్న పట్టణంలో మొదలైందని, పగుళ్లిచ్చిన కోర్టుల నుంచి ప్రపంచంలోని అతిపెద్ద వేదికలపై ఆడే స్థాయికి ఎదగడం ఒక కలలా ఉందని గుర్తు చేసుకున్నాడు. ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన తల్లిదండ్రులు, సోదరి, భార్య సుప్రియ, కుమార్తె త్రిధ, కోచ్‌లు, అభిమానులు, దేశానికి కృతజ్ఞతలు తెలిపాడు. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో లభించిన గొప్ప గౌరవం. త్రివర్ణ పతాకం పేరుతో బరిలోకి దిగిన ప్రతిసారీ ఆ గర్వాన్ని, బాధ్యతను మోశాను" అని బోపన్న ఉద్ఘాటించాడు. తన కెరీర్‌లో మొత్తం ఐదు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌కు చేరిన బోపన్న, డేవిస్ కప్, ఒలింపిక్స్‌లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహించాడు.తాను పోటీల నుంచి తప్పుకుంటున్నప్పటికీ, టెన్నిస్‌తో తన బంధం ముగియలేదని స్పష్టం చేశాడు. "చిన్న పట్టణాల నుంచి వచ్చే యువ క్రీడాకారులలో స్ఫూర్తి నింపాలనుకుంటున్నాను. ఇది వీడ్కోలు కాదు, నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని బోపన్న తన పోస్ట్‌ను ముగించాడు.

## బీహార్ లో ఎన్నికల ప్రచారానికి మొంథా తుపాను దెబ్బ

మొదటి పేజి తరువాయి

తీరం దాటినా గానీ మొంథా తుపాను అనేక రాష్ట్రాలను అతలాకుతలం చేస్తోంది. తాజాగా, బీహార్ రాష్ట్రంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలుల కారణంగా జనజీవనం స్తంభించడంతో పాటు, రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ప్రతికూల వాతావరణంతో శుక్రవారం దాదాపు 23 ఎన్నికల ర్యాలీలు రద్దయ్యాయి. శనివారం కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది. వాతావరణం అనుకూలించకపోవడంతో హెలికాప్టర్లు ఎగిరే పరిస్థితి లేకపోయింది. దీంతో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ, నటుడు పవన్ సింగ్ వంటి పలువురు కీలక నేతలు తమ ప్రచార కార్యక్రమాలను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. కొందరు నేతలు సభలకు భౌతికంగా హాజరుకాలేకపోయినా, మొబైల్ ఫోన్ల ద్వారా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. శనివారం సహర్సాలో జరగాల్సిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ర్యాలీ కూడా రద్దయింది. దీంతో ఆమె బచ్‌వారా అసెంబ్లీ నియోజకవర్గానికి రోడ్డు మార్గంలో వెళ్లి సభలో పాల్గొన్నారు. ఈ తుపాను ప్రభావం కేవలం రాజకీయాలకే పరిమితం కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ పంటలకు, ముఖ్యంగా వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న పంట దెబ్బతినడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ ప్రకారం, శనివారం కూడా చాలా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురు గాలులు కొనసాగే అవకాశం ఉంది. అరారియా, కిషన్‌గంజ్, పూర్ణియా ప్రాంతాలకు భారీ వర్ష సూచన జారీ చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రంలోని చాలా నగరాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శనివారం బంకాలో అత్యధికంగా 27.4 డిగ్రీల సెల్సియస్, వాల్మీకి నగర్‌లో అత్యల్పంగా 20.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అనవసర ప్రయాణాలు చేయవద్దని పరిపాలన యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. ఆదివారం (నవంబర్ 2) నుంచి వాతావరణం క్రమంగా మెరుగుపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## కాస్త తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు చమురు మార్కెటింగ్ కంపెనీలు స్వల్ప ఊరట కల్పించాయి. 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరను 5 రూపాయల మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. సవరించిన ఈ కొత్త ధరలు నవంబర్ 1వ తేదీ నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ప్రతి నెల మొదటి తేదీన చమురు సంస్థలు గ్యాస్ సిలిండర్ల ధరలను సమీక్షిస్తుంటాయి. ఈ ప్రక్రియలో భాగంగా ఈరోజు వాణిజ్య సిలిండర్ ధరను తగ్గించాయి. తాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.1,595.50 నుంచి రూ.1,590.50కి చేరింది. ఇతర ప్రధాన నగరాల్లో ధరలను పరిశీలిస్తే.. కోల్‌కతాలో రూ.1,694, ముంబైలో రూ.1,542, చెన్నైలో రూ. 1,750గా ఉంది. ఇక మన హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ కొత్త ధర రూ.1,812.50గా నమోదైంది. అయితే, ఈ తగ్గింపు కేవలం వాణిజ్య సిలిండర్లకు మాత్రమే పరిమితమైంది. ఇళ్లలో వంట కోసం ఉపయోగించే 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుతం దేశంలోని ప్రధాన నగరాల్లో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.850 నుంచి రూ.960 మధ్య స్థిరంగా కొనసాగుతోంది.

## కాశీబుగ్గ ఆలయం ప్రభుత్వానికి చెందినది కాదుం
## : దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఫ్యాక్ట్ చెక్

మొదటి పేజి తరువాయి


సదరు ఆలయం ప్రభుత్వ దేవాదాయ శాఖ పరిధిలోనిది కాదని, అది ఒక ప్రైవేట్ దేవాలయమని కీలక విషయాలు వెల్లడించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, "కాశీబుగ్గలోని వెంకటేశ్వర ఆలయాన్ని హరిముకుంద్‌పండా అనే వ్యక్తి తన సొంత నిధులతో, తనకు చెందిన 12 ఎకరాల స్థలంలో నిర్మించారు. ఈ ఆలయం ప్రభుత్వ నిర్వహణలో కానీ, దేవాదాయ శాఖ ఆధీనంలో కానీ లేదు. ఇది పూర్తిగా ఒక ప్రైవేట్ వ్యవహారం" అని వివరించారు. ఆలయ సామర్థ్యానికి మించి భక్తులు రావడం వల్లే ఈ దుర్ఘటన చోటు చేసుకుందని ఆయన తెలిపారు. "ఆలయ సామర్థ్యం కేవలం 2,000 నుంచి 3,000 మంది మాత్రమే. కానీ, శనివారం ఏకాదశి కావడంతో ఒక్కసారిగా దాదాపు 25,000 మంది భక్తులు తరలివచ్చారు. ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నప్పుడు నిర్వాహకులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. కనీసం ప్రభుత్వానికి లేదా పోలీసులకు కూడా సమాచారం ఇవ్వలేదు. ఈ నిర్లక్ష్యమే తొక్కిసలాటకు దారితీసింది" అని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నా యని మంత్రి తెలిపారు. మంత్రులు, అధికారులు ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్య వేక్షిస్తున్నారని, క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఆయన వివరించారు.

## ఇందిరాగాంధీ ప్రపంచ దేశాలను శాసిస్తే.. మోదీని ప్రపంచ దేశాలు శాసిస్తున్నాయి

మొదటి పేజి తరువాయి

నేడు ప్రధాని మోదీని ప్రపంచ దేశాలు శాసిస్తున్నాయని ఆయన విమర్శించారు. తెలంగాణలో 14, ఆంధ్రప్రదేశ్‌లో 20 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని జగ్గారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ ప్రధాని అయితే తెలంగాణ అభివృద్ధి చెందడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్య పరిష్కారం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అవుతాయని హామీ ఇచ్చారు. రెండు రాష్ట్రాల ప్రజలు ఈ విషయంపై ఇప్పటి నుంచే ఆలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో పదేళ్లు కేసీఆర్... ఏపీలో జగన్, చంద్రబాబు ముఖ్యమంత్రులుగా ఉండి కేంద్రంలోని బీజేపీకి మద్దతు ఇచ్చినా, రాష్ట్రాలకు నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని జగ్గారెడ్డి ఆరోపించారు. రాజీవ్ గాంధీ చేపట్టిన సంస్కరణల వల్లే దేశంలో ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, నేడు కోట్లాది మందికి ఉపాధి లభిస్తోందని గుర్తు చేశారు. యూపీఏ హయాంలో తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం గ్రామాల్లో పేదలకు అండగా నిలిచిందన్నారు. గత పదేళ్ల బీజేపీ పాలనలో మహిళలకు ఉపాధి, యువతకు ఉద్యోగాలు దొరకలేదని జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విదేశాల్లోని నల్లధనం తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చిన ప్రధాని మోదీని ప్రజలు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. కేసీఆర్, జగన్, చంద్రబాబు ముగ్గురూ మోదీ నీడలోనే పాలన సాగించారని విమర్శించారు. దేశవ్యాప్తంగా 300 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ప్రజలను కోరారు. మాట ఇస్తే నిలబెట్టుకునే వ్యక్తి రాహుల్ గాంధీ అని, ఆయన కుటుంబం అలాంటిదేనని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## క్రియేటివిటీ హబ్‌గా హైదరాబాద్ : మంత్రి శ్రీధర్ బాబు



మొదటి పేజి తరువాయి

మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. క్రియేటివ్ రంగానికి చేయుతనిచ్చేలా క్రియేటివ్ ఫ్యూచర్స్ ఫండ్, ఈస్పోర్ట్స్ అకాడమీ, మహిళా క్రియేటర్ల కోసం ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ను ప్రభుత్వంతో కలిసి ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సంబంధిత దిగ్గజ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశ గేమింగ్ పరిశ్రమ విలువ 20 శాతం సీఏజీఆర్ తో 2028 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. భారతదేశ మొత్తం వీఎఫ్ఎక్స్ అవుట్ పుట్‌లో మన వాటా సుమారు 25 శాతం ఉండటం మనకు గర్వకారణమన్నారు. హైదరాబాద్ ఓటీటీ కంటెంట్ ప్రొడక్షన్‌లో 35 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఇక్కడి ఎకో సిస్టంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఇమేజ్ టవర్, ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ సిటీ తదితరాల అందుబాటులోకి వస్తే ఈ ఎకో సిస్టం మరింత పటిష్టం అవుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇమేజ్ టవర్‌ను వచ్చే ఏడాదిలో అందుబాటులోకి తెస్తామన్నారు. క్రియేటివిటీలో సానుభూతి, వైవిధ్యం, సస్టైనబిలిటీ, భారతీయ గుర్తింపు ప్రతిబింబించేలా చొరవ తీసుకోవాలని యువ క్రియేటర్స్‌కు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం నియంత్రించేదిగా కాకుండా "కో క్రియేటర్" గా మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, యువ కథానాయకుడు తేజ సజ్జా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్, టీవీఏజీఏ ప్రెసిడెంట్ రాజీవ్ చిలక, కార్యదర్శి మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంతపెద్ద తుపానులో ఎక్కువ ప్రాణనష్టం లేకుండా చూశాం... కానీ ఇవాళ భారీ ప్రాణ నష్టం జరిగింది

మొదటి పేజి తరువాయి

ఈ దుర్ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. శనివారం శ్రీ సత్యసాయి జిల్లా పెద్దన్నవారిపల్లిలో 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. అనంతరం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గ ఘటనను ప్రస్తావించారు. అంత పెద్ద తుపానులో ముందస్తు ప్రణాళిక ద్వారా ఎక్కువ ప్రాణ నష్టం లేకుండా చూడగలిగామని... తీరా చూస్తే ఈరోజు ప్రైవేటు వ్యక్తుల బాధ్యతా రాహిత్య చర్యలతో ఇంత పెద్ద ప్రాణనష్టం జరిగిందని... ఇది అత్యంత బాధాకరమని అన్నారు. కాగా, ప్రజావేదిక సభ వేదికగా కాశీబుగ్గ మృతులకు సంతాపంగా రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. ఆలయ నిర్వాహకులు ముందుగానే పోలీసులకు చెప్పి ఉంటే భక్తులను క్యూలైన్లలో నియంత్రించేందుకు అవకాశం ఉండేదని చంద్రబాబు అన్నారు. ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కాశీబుగ్గ ప్రమాద ఘటనపై ఏపీ ప్రభుత్వం ప్రకటన

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ దుర్ఘటనలో 9 మంది భక్తులు మరణించారని, మరో 13 మంది గాయపడ్డారని ప్రభుత్వం ధృవీకరించింది. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. శనివారం ఏకాదశి పర్వదినం సందర్భంగా కాశీబుగ్గలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారని ప్రభుత్వం వెల్లడించింది.




ఉదయం సుమారు 15 వేల మందికి పైగా భక్తులు ఒకేసారి దర్శనం కోసం ప్రయత్నించడంతో ఆలయంలోని రెయిలింగ్ విరిగిపోయిందని.... దీంతో ఒక్కసారిగా భక్తులు ఒకరిపై ఒకరు పడిపోవడం తో తీవ్ర తొక్కిసలాట చోటుచేసుకుందని వివరించింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మరణించారని తెలిపింది. ప్రమాద విషయం తెలిసిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, వైద్య బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయని, గాయపడిన వారిని హుటాహుటిన పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని వెల్లడించింది. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని, అవసరమైతే మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం, విజయవాడలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఏపీ ప్రభుత్వం పేర్కొంది. కాగా, ఘటనపై ముఖ్యమంత్రి కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఆలయాల్లో భద్రతా ఏర్పాట్లు, భక్తుల రద్దీ నియంత్రణపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు పేర్కొంది. ఈ విషాద ఘటనతో కాశీబుగ్గ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఎల్లుండే బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు సంచలన నిర్ణయం.. రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ

మొదటి పేజి తరువాయి

జూబ్లీహిల్స్ ప్రచారపర్వంలో పార్టీల మధ్య డైలాగుల తూటాలు పేలుతున్న సమయంలో ఇప్పుడు బీసీ రిజర్వేషన్ అంశంపై హైకోర్టులో విచారణ స్టేట్ పాలిటిక్స్ ను ఎలాంటి పరిణామాల వైపు తీసుకెళ్తునుందో సస్పెన్స్ గా మారింది.

సుప్రీం టు హైకోర్టు:

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగానికి విరుద్ధం అంటూదాఖలైన పిటిషన్ పై గత నెల నెల 9న విచారణ జరిపిన హైకోర్టు రిజర్వేషన్లపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ సైతం దాఖలు చేసింది. అయితే ఈ విషయాన్ని హైకోర్టులోనే తేల్చుకోవాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్?ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దాంతో హైకోర్టు నిర్ణయంకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురు చూస్తోంది. గత విచారణలో రిజర్వేషన్ల జీవోపై స్టే విధించిన హైకోర్టు నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి,




ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాల దాఖలుకు పిటిషనర్లకు రెండు వారాల గడువు ఇస్తూ తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ వాయిదా అనంతరం ఎల్లుండి హైకోర్టులో విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో హైకోర్టు బీసీ రిజర్వేషన్ల అంశంపై కీలక నిర్ణయం వెలువరించే అవకాశం ఉంది. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం తీసుకోబోయే నిర్ణయంపై అందరిలో ఆసక్తి నెలకొంది.

హైకోర్టు తీర్పు తర్వాతే సర్కార్ నిర్ణయం:

నవంబర్ 3న హైకోర్టు వెలువరించే నిర్ణయం ఆధారంగా స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. గత నెల 23న జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరిగింది. ఈ భేటీలో హైకోర్టు నిర్ణయం ఆధారంగా స్థానిక ఎన్నికలపై ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. హైకోర్టు నిర్ణయం తర్వాత నవంబర్ 7వ తేదీన మరోసారి మంత్రివర్గం సమావేశంపై తుది నిర్ణయం తీసుకుంటామని గత కేబినెట్ భేటీ సందర్భంగా మంత్రి పొంగులేటి వెల్లడించారు. అయితే హైకోర్టు స్టే విధించడంతో రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశావహులంతా నిరాశ చెందారు. ఆయా పార్టీల శ్రేణులంతా డీలపడిపోయాయి. ఈ నేపథ్యంలో సోమవారం హైకోర్టు నిర్ణయం, రాష్ట్ర ప్రభుత్వ వ్యూహం ఎలా ఉండబోతున్నాయనేది రాష్ట్ర తా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# టీమ్ స్పిరిట్.. టెక్నాలజీతో మొంథాపై విజయం

మొదటి పేజి తరువాయి

జరిగిన కార్యక్రమంలో తుపాన్ సమయంలో అద్భుతమైన పనితీరు కనబరిచిన 137 మంది 'మొంథా ఫైటర్ల'ను ఆయన సత్కరించి, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ప్రతి సంక్షోభం మనకు ఒక అవకాశం. ఈసారి తుపాన్ నష్టాన్ని తగ్గించడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ప్రజల తరఫున ధన్యవాదాలు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తుందనడానికి ఈ విజయమే నిదర్శనం. ఈ అనుభవాన్ని భవిష్యత్తులో విపత్తుల నిర్వహణ కోసం ఒక మాన్యువల్‌గా రూపొందిద్దాం" అని పిలుపునిచ్చారు.

టెక్నాలజీతో నష్ట నివారణ

తుపాన్ల సమయంలో టెక్నాలజీ వినియోగంపై చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (%ూ×%) మోడల్స్, 'అవేర్ 2.0' వ్యవస్థ ద్వారా తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాం. మానిటరింగ్, అలెర్ట్, రెస్క్యూ, పునరావాసం, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణ అనే ఐదు సూత్రాల ఫార్ములాతో నష్టాన్ని తగ్గించగలిగాం. రియల్ టైమ్‌లో హెచ్చరికలు



జారీ చేసి ప్రజలను అప్రమత్తం చేశాం" అని వివరించారు. సమర్థ నీటి నిర్వహణతో రాయలసీమలో కరువును జయించినట్లే, టెక్నాలజీతో కోస్తాంధ్ర తుఫాన్ల ప్రభావాన్ని తగ్గిస్తున్నామని అన్నారు.

క్షేత్రస్థాయిలో సమష్టి కృషి

తుపాన్ సమయంలో చేపట్టిన సహాయక చర్యలను ముఖ్యమంత్రి కొనియాడారు. "డ్రోన్ల సహాయంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడాం. పర్చూరు వాగులో చిక్కుకున్న షేక్ మున్నాను, ఒక ప్రార్థనా మందిరంలో ఉన్న 15 మందిని రక్షించిన విషయాన్ని గుర్తుచేశారు. ముందస్తుగానే 602 డ్రోన్లను సిద్ధం చేశామని, కాలువల్లో పూడిక తీయడం వల్ల భారీ వర్షాలకు కూడా వరద ముప్పు తగ్గిందని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు సీఎస్ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అంతా కలిసి పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది" అని తెలిపారు.

త్వరలో గ్రామ స్థాయి వరకు హెచ్చరికల వ్యవస్థ

త్వరలోనే రాజధాని నుంచే నేరుగా గ్రామ స్థాయి వరకు హెచ్చరికలు పంపే వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, మంత్రులు అనిత, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాశ్, డోలా బాలవీరాంజనేయ స్వామి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కాశీబుగ్గ తొక్కిసలాటపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి... రూ.2 లక్షల పరిహారం

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి 9 మంది మరణించిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర సంఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన ప్రధాని, బాధితులకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ ఘటనపై స్పందించిన ప్రధాని మోదీ, "ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట అత్యంత బాధాకరం. తమ సన్నిహితులను, కుటుంబసభ్యులను కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా, ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (%ూవీచీ=ఖీ%) నుంచి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గాయపడిన వారికి రూ. 50,000 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రధాని కార్యాలయం వెల్లడించింది. ఆలయంలో జరిగిన ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## అప్పుడు అవమానం, ఇప్పుడు గౌరవం.. బీహార్ ఓటర్లకు నితీశ్ కుమార్ వీడియో సందేశం

మొదటి పేజి తరువాయి



సేవ చేశానని పేర్కొంటూ, రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మూడు నిమిషాల నిడివి గల ఈ వీడియోలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. "బీహార్‌లోని నా ప్రియమైన సోదరసోదరీమణులారా, 2005 నుంచి నాకు సేవ చేసే అవకాశం ఇచ్చారు. నేను మీకు చెప్పాలనుకుంటున్నది ఏంటంటే.. మేము అధికారంలోకి వచ్చినప్పుడు బీహార్ పరిస్థితి దారుణంగా ఉండేది. ఆ రోజుల్లో 'బీహారీ' అని చెప్పుకోవడం ఒక అవమానంగా భావించేవారు. అప్పటి నుంచి రేయింబవళ్లు నిజాయతీగా, కష్టపడి మీకు సేవ చేశాం" అని తెలిపారు. తమ పాలనలో విద్య, ఆరోగ్యం, రోడ్లు, విద్యుత్, తాగునీరు, వ్యవసాయం, యువతకు అవకాశాలు వంటి అన్ని రంగాలను మెరుగుపరిచామని వివరించారు. "గత ప్రభుత్వాలు మహిళల కోసం ఏ పనీ చేయలేదు. మేము మహిళలను ఎవరిపైనా ఆధారపడకుండా బతికేలా బలోపేతం చేశాం. ఇప్పుడు వారు తమ కుటుంబాలను, పిల్లలను చూసుకోగలరు. మేము సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేశాం" అని అన్నారు. "హిందువులు, ముస్లింలు, అగ్రవర్ణాలు, వెనుకబడిన వర్గాలు, దళితులు, మహాదళితులు అనే తేడా లేకుండా అందరి కోసం పనిచేశాను. నా కుటుంబం కోసం నేను ఏమీ చేయలేదు" అని నితీశ్ కుమార్ స్పష్టం చేశారు. "ఇప్పుడు బీహారీ అని చెప్పుకోవడం అవమానం కాదు, అది గౌరవానికి ప్రతీకగా మారింది" అని ఆయన వ్యాఖ్యానించారు. "మాకు మరో అవకాశం ఇవ్వండి. ఈసారి బీహార్‌ను దేశంలోని అగ్ర రాష్ట్రాల జాబితాలో చేర్చేంతగా అభివృద్ధి చేస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కాగా, బీహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## ఇంగ్లీష్, హిందీ భాషలపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు

దక్షిణాది రాష్ట్రాల్లో హిందీ, ఇంగ్లీష్ భాషలు పిల్లల నైపుణ్యాలను బలహీనపరుస్తున్నాయని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. విద్యాసంస్థల్లో మాతృభాషను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి, దక్షిణాది రాష్ట్రాలకు హిందీ భాష విషయంలో మాటల యుద్ధం కొనసాగుతున్న తరుణంలో సిద్ధరామయ్య చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.దకర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కర్ణాటకపై సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తూ హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అభివృద్ధి చెందిన దేశాలలో పిల్లలు తమ మాతృభాషలోనే విద్యను అభ్యసిస్తారని, మన దేశంలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉందని ఆయన అన్నారు. ఇంగ్లీష్, హిందీ భాషలు పిల్లల నైపుణ్యాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషను బోధనా మాధ్యమంగా ప్రవేశపెడుతూ కేంద్రం చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. విద్య విషయంలో కన్నడ భాష పట్ల జరుగుతున్న నిర్లక్ష్యం రాష్ట్రంలో అనేక సమస్యలకు కారణమవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. హిందీ, సంస్కృత భాషాభివృద్ధికి నిధులు కేటాయిస్తున్న కేంద్రం, దేశంలోని ఇతర మాతృభాషల అభివృద్ధికి మాత్రం గ్రాంట్లు మంజూరు చేయడం లేదని ఆయన ఆరోపించారు. కన్నడను వ్యతిరేకించే వారిని రాష్ట్ర ప్రజలు కూడా వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి రూ. 4.5 లక్షల కోట్ల ఆదాయం వెళుతున్నప్పటికీ, కేంద్రం నుంచి మాత్రం కర్ణాటక అభివృద్ధికి తగిన నిధులు రావడం లేదని ఆయన ఆరోపించారు.ద

## బీజేపీ, జేడీయూ ఇన్నేళ్లేం చేశాయి? : ఎన్డీయే కీలక హామీపై ప్రియాంక గాంధీ ప్రశ్న

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి విజయం సాధిస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీ ధీమా వ్యక్తం చేశారు. బీహార్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడానికి ముందు ఆమె పాట్నా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎన్డీయే కూటమి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని విమర్శించారు.దఎన్డీయే ప్రభుత్వం కోటి ఉద్యోగాల హామీ గురించి మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, ఇన్నేళ్లు అధికారంలో ఉండి ఎందుకు నెరవేర్చలేదని ఆమె బీజేపీ, జేడీయూలను నిలదీశారు.

## 'ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణం'

కాశీబగ్గ దుర్ఘటనకు ప్రభుత్వ వైఫల్యం, నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజియన్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు. ' సాక్షి' తో మాట్లాడిన ఆయన.. కాశీబుగ్గ దర్ఘటన అనేది అత్యం దురుదృష్టకరం. ప్రభుత్వ వైఫల్యం..నిర్లక్ష్యం కారణంగా ఈ సంఘటన జరిగింది. వేలాదిగా భక్తులు తరలివచ్చినప్పుడు ఆలయం వద్ద ప్రభుత్వం ఎలాంటి భద్రత చర్యలు తీసుకుంది?, తిరుమల, సింహచలం, కాశిబుగ్గ ఘటనలు కలిచి వేస్తున్నాయి. రాష్ట్రంలో ఇవాళ 23 వేల దేవదాయ శాఖకు చెందిన ఆలయాలు దిక్కు మొక్కు లేకుండా ఉన్నాయి.. ఆలయాలను ప్రైవేటు వ్యక్తులు కట్టినా...ఆ ఆలయాలకు భక్తులు తరలివస్తే.. దానిని ప్రైవేటు టెంపుల్‌గా చూడవద్దని కోర్టు తీర్పులు చెబుతున్నాయి.పర్వదిన్నాల్లో ఏ ఆలయాలకు ఎంత మంది భక్తులు వస్తారో అని పోలీసు శాఖకు అంచనాలేదు. సిని తారాలకు మాత్రం భారీగా బందోబస్తు ఉంటుంది. పోలీసు అధికారుల నుండి హోం మంత్రి వరకు భక్తుల విషయంలో చాల నిర్లక్ష్యంగా ఉన్నారు. రాష్ట్రంలో రూల్ బుక్ లేదు...రెడ్ బుక్ మాత్రమే ఉంది. ఘటనపై విచారణ జరిపి, భాధ్యులపై చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి'అని కురసాల కన్నబాబు సూచించారు.

# ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి మహాకుంభాభిషేక మహోత్సవం









**- ప్రత్యేక పూజలు కుంభాభిషేకాలు.**
**- వేకువనుండే పోటెత్తిన భక్తులు**
**- ప్రత్యేక సౌకర్యాలు నిర్వహించిన నిర్వాహకులు.**
**- కుంబాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే**

**పామూరు ప్రజలకి చేరువ ప్రతినిధి**

పామూరు విరాట్ నగర్ లో వేంచేసి ఉన్న శ్రీ గోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థాన మహా కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే ఆలయ అర్చకులు గణపతి పూజ, హెూమాలు, స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కనిగిరి శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణాహుతి హెూమం, స్వామివారి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల్లో భక్తి భావన పెంపొందినప్పుడే సమాజం ప్రశాంతంగా ఉంటుందన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి నాడు చెప్పిన విషయాలు నేడు అమలు జరుగుతున్నాయని వీరబ్రహ్మేంద్రస్వామి ఒక మహనీయుడు మహోన్నతమైన వ్యక్తి అని ఎమ్మెల్యే అన్నారు. భవిష్యత్తు కాలంలో జరుగు సన్నివేశాలను సంఘటనలను ముందే ఊహించి రచించిన మహనీయుడనీ అటువంటి మహనీయుని కుంభాభిషేకం మహోత్సవంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతం అన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేయడం అభినందనీయమని భక్తులు వేకునుండే పూజల్లో పాల్గొనడం చూస్తుంటే ఆ మహోన్నతమైన వ్యక్తిని ఎంతలా ఆరాధిస్తున్నారో ఇట్టే అర్థమవుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పూజలకు హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. స్వామి వారి కుంభాభిషేకం మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ సిబ్బందికి ఆలయ కమిటీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన పామూరు మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నొస్సం నాగేంద్ర చారి, ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం అధ్యక్షురాలు వినుకొండ శ్యామల, పామూరు మండల టిడిపి అధ్యక్షులు బొల్లా నరసింహారావు, మాజీ టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి నియోజకవర్గం అధ్యక్షులు పందిటి హరీష్, పామూరు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థాన చైర్మన్ దొరసానచారి, దేవస్థాన గౌరవ అధ్యక్షుడు రామాచారి,మాజీ విశ్వబ్రాహ్మణ యువజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెరమన విజయ్ కుమార్ చారి, దేవస్థాన కమిటి సభ్యులు పెనువర్తి రాజా, సుకేష్ , శివ, బాల బ్రహ్మాచారి, బాలబ్రహ్మం, శేఖర్, ప్రసాద్ విశ్వబ్రాహ్మణ కుటుంబ సభ్యులు, పామూరు మండల ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

# చీర్లదిన్నె సచివాలయంలో 104వైద్య సేవలు.



**కనిగిరి : ప్రజలకు చేరువ**

మండలంలోని చీర్లదిన్నె పంచాయతీ సచివాలయంలో డేటా ఏం ట్రీ ఆపరేటర్ బిందు అధ్యక్షతన 104వైద్యసేవలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామవాసులకు షుగర్ బీపి హెచ్ బి టెస్టులు చేయడం జరిగింది. సంబంధిత మందులు ప్రజలకు ఉచితంగా ఇవ్వడం జరిగింది. అదేవిధంగా విషజ్వరాలు గురించి ప్రజలకు తెలియజేయడం జరిగింది. ఆరోగ్యం గురించి జాగ్రత్త లు పాటించలన్నారు. సమావేశంలో ఎ యన్ యమ్ నాగమల్లేశ్వరి యమ్ యల్ హెచ్ పి రాజేశ్వరి తదితరులు వున్నారు.

# విద్యార్థులకు పౌష్టిక ఆహారం పంపిణీ



**సింగరాయకొండ : ప్రజలకి చేరువ**

మండలంలోని స్థానిక కందుకూరు రోడ్ కూడలిలో నూతనంగా ప్రారంభించిన "రాజేష్ చిల్డ్రన్స్ హాస్పిటల్ " వారు మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల గవదగట్లవారి పాలెం చిన్నారులకు కార్తీక సోమవారం పర్వదినం సందర్భంగా " శుభదిన్ భోజన్ " పౌష్టిక ఆహారం అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వం డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజన పథకం ద్వారా పౌష్టిక ఆహారం అందిస్తున్నదని ప్రత్యేకమైన శుభదినాలలో దాతల సహకారంతో పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నామని.సీజనల్ వ్యాధులు పట్ల అవగాహన కల్పిస్తూ పిల్లలకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించడం, అత్యవసర చికిత్సలు చేయడం జరుగుతుందని తెలియజేసారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అఱ్ఱిబోయిన రాంబాబు,హాస్పిటల్ మేనేజర్ రోశయ్య,ఉపాధ్యాయులు అజయ్ చౌదరి,చైర్మన్ వాణి, పద్మ, రాధ, తల్లిదండ్రులు పాల్గొని డాక్టర్ రాజేష్ కు ధన్యవాదములు తెలియజేశారు.

# రోడ్డుపై బురద తొలగించాలంటూ గిరిజనులు ఆందోళన





**రోలుగుంట ప్రజలకి చేరువ ప్రతినిధి**

అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం అర్ల,శరభవరం పంచాయతీ పరిధిలో రాజన్నపేట నుండి అర్ల వెళ్లే రోడ్డు బోడు మెట్ట వద్ద బురద ఊబి తొలగించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం బురదలోదిగి నిరసన దీక్ష చేపట్టారు. శరభవరం పంచాయతీ పరిధిలో వడ్డీప నుండి రాజన్నపేట నుండి గదబపాలెం. గుర్రాల బై లు. తారు రోడ్డు నిర్మాణం చేయడం జరిగిందనీ,వడ్డీప నుండి ఆర్ల ప్రధానమంత్రి రోజ్గార్ యోజన సడక్ పథకం కింద తారు రోడ్డు నిర్మాణం చేయడం జరిగిందన్నారు.రాజన్నపేట బోడిమెట్ట నల్లరాయి క్వారీ రోడ్డు నిర్మాణం నిమిత్తం కొత్త రోడ్డు ఫార్మేషన్ చేశారు. ఫార్మేషన్ చేసిన రోడ్డు నెట్ అంత కలిపి తారు రోడ్డు వద్ద బురదగా ఊబి తయారైందన్నారు. దీనివల్ల రాత్రి వేళలో అనేక మంది గిరిజనులు బైక్ మీద ఊబిలో కూరుకు పోతున్నారని,దీంతో 108 కూడా రావడానికి ఆస్కారం లేదనీ. రేషన్ బియ్యం కోసం రాజన్నపేట కు కాళ్లనడకనే వెళ్లవలసిన పరిస్థితి నెలకొందని ,ప్రభుత్వం కోట్లు ఖర్చుపెట్టి రోడ్డు తారు రోడ్లు వేస్తున్నారు. ఈ రోడ్లన్నీ నల్లరాయి క్వారీ భారీ వాహనాల వల్ల తారు రోడ్డు బురద ఊబిగా తయారవుతున్నాయనీ. దీంతో చాలా ఇబ్బందులు గురవుతున్నామనీ. తక్షణమే ఊబిను తొలగించి రవాణాకు ఆటంకోలేకుండా చేయవలసిందిగా అధికారులను కోరుతున్నారు. ప్రధానమైన గిరిజన ప్రాంతాల్లో ఉన్న రోడ్లు నల్లరాయి క్వారీ రవాణా చేయడంతో ఉన్న రోడ్లన్నీ బురదగా మారిపోతున్నాయి. పూర్వం డోలీలే గతి అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం డోలి రహితగా గ్రామాలుగా తయారు చేస్తామని చెప్తున్నారు ఒకవైపు ప్రకటనలు చేస్తున్నారు. మరోవైపు ఉన్న తారు రోడ్లను మైనింగ్ భారీ వాహనాలతో రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయి. క్వారీలు రావడంతో పర్యావరణాన్ని పరిరక్షిస్తామని. రోడ్ల వైపు చెట్లు నాడుతామని గ్రామసభల్లో హామీలు ఇచ్చారు. నేటికీ సంవత్సరాలు అవుతున్న ఒక క్వారీ కూడా రోడ్డుపక్కల మొక్కలు నాటే పరిస్థితిలో లేదు. ఉన్న రోడ్లన్నీ కూడా భారీ వాహనాల వల్ల రోడ్లు అవుతున్నాయి. తక్షణమే బురదను తొలగించి కోరుతూ అధికారులకు వేడుకోవడం జరిగింది. లేని పరిస్థితిలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు,గిరిజన సంఘం నాయకులు నీలపు శ్రీను, చిన్ని, రమణ, తెలిపారు.

# నారాయణస్వామి హుండీ ఆదాయం 1,77,447

**చంద్రశేఖరపురం ప్రజలకి చేరువ ప్రతినిధి**



మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ నారాయణ స్వామి దేవస్థానం ఆదాయం1,77,447 రూపాయలు (ఆదివారం) వచ్చిందని ఆలయ నిర్వాహక అధికారి గిరి రాజు నరసింహ బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టికెట్ అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయం 75,310, లడ్డు ప్రసాద్ ద్వారా వచ్చిన ఆదాయం 37,610 రూపాయలు, శాశ్విత అన్నదానముకు వచ్చిన ఆదాయం 47,495 రూపాయలు పంచామృత అభిషేకముల ద్వారా వచ్చిన ఆదాయం 11,032 శ్రీ స్వామివారికి పాదకామకల వచ్చిన ఆదాయం 6000 రూపాయలు మొత్తం కలిపి1,77447 రూపాయలు నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఒక్కరోజు రావడం జరిగిందని తెలిపారు..

# ఎక్ప్రెస్ సర్వీసులలో కండక్టర్ ఉండేలా చూడాలి

**కనిగిరి: ప్రజలకి చేరువ**



కనిగిరి ఐద్వా నాయకులు సోమవారం కనిగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ సయానా బేగం ను కలిసి సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం ఆర్టీసీ సర్వీసులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ప్రయోజనకరంగా ఉందన్నారు. అయితే ఎక్స్ప్రెస్ సర్వీసులలో డ్రైవర్ కండక్టర్ విధులను కూడా నిర్వహించాల్సి రావడం వలన గమ్యస్థానాలకు చేరేందుకు ఆలస్యం అవుతుందని తెలిపారు. ఈ విషయాన్ని తాము స్వయంగా గమనించడం జరిగిందని ఆమెకు తెలిపారు. పల్లె వెలుగు బస్సు సర్వీసులు కండక్టర్ ఉండటంవల్ల ఎక్స్ప్రెస్ సర్వీస్ కంటే ముందుగా గమ్యస్థానాలకు చేరుతున్నాయని తెలిపారు. ఎక్స్ప్రెస్ సర్వీసులలో కండక్టర్ ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ప్రసన్న,ఆదిలక్ష్మి, నిర్మల, రత్తమ్మ, రుఫియా, మల్లేశ్వరి, రత్నా, తిరుపతమ్మ, శాంతకుమారి, ఎలిషమ్మ తదితరులు పాల్గొన్నారు

# పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

**కనిగిరి ప్రజలకి చేరువ ప్రతినిధి**

పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు కనిగిరి ఎస్సై టి శ్రీరామ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.ప్రకాశం జిల్లా ఎస్పీ,కనిగిరి డిఎస్పి పి సాయి ఈశ్వర్ యశ్వంత్ , కనిగిరి సీఐ షేక్ ఖాజావలి ఆదేశాల మేరకు కనిగిరి టౌన్ లో కాశిరెడ్డి కాలనీలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను కనిగిరి ఎస్సై టి శ్రీరామ్, సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 7320/-రూపాయల నగదు స్వాధీనం చేసుకొని వారిని కనిగిరి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.



# కిటకిటలాడిన రామలింగేశ్వర స్వామి ఆలయం

**సంతనూతలపాడు ప్రజలకి చేరువ ప్రతినిధి**





సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట లోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం నాడు ఘనంగా కార్తీక మాస రెండవ సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు అలియాస్ బాబు దంపతులు అభిషేక పూజలలొ పాల్గొన్నారు. దేవాదాయ శాఖ ఇ. ఓ. ప్రసన్న లక్ష్మి, దాతలు, ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు. ఆలయ అర్చకులు సోమరాజు పల్లి అనిల్ కుమార్ స్వామివార్లకు అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఈ సందర్భంగా ఆలయాలకు వచ్చి దీపారాధనలు వెలిగించి స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈనెల 5 న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈ వేడుకలు ఘనంగా జరగనున్నవి. పలు కేంద్రాల నుండి మహిళలు భారీ సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి

- దివ్యాంగులకు ఉచిత త్రీవీలర్ మోటార్ సైకిళ్లు
- అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**అమరావతి/ వెలగపూడి : ప్రజలకి చేరువ**

దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, రాష్ట్రంలోని దివ్యాంగులకు ఉచితంగా రెట్రోఫిట్టెడ్ త్రీవీలర్ మోటార్ సైకిళ్లు అందజేయనున్నట్లు మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. సోమవారం నాడు విడుదల చేసిన ఓ పత్రిక ప్రకటనలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.....రాష్ట్రంలోని దివ్యాంగులకు ఉచితంగా 1750 రెట్రోఫిట్టెడ్ త్రీవీలర్ మోటార్ సైకిళ్ల కూటమి ప్రభుత్వం అందజేయనుంది, అర్హులైన వారు 25.11.2025 లోపు ఆన్ లైన్ లో ధరఖాస్తుచేసుకోవాలన్నారు. రెగ్యులర్ గ్రాడ్యుయేషన్, ఆపై ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులు మరియు కనీసం 10 వతరగతి పాసై స్వయం ఉపాధితో జీవించే వారు, 18 నుంచి 45 ఏళ్ల లోపు వయసు ఉండి, 70 శాతం అంగవైకల్యం గలవారు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు అర్హులని మంత్రి తెలిపారు. మరిన్ని వివరాలకు www.apdascac.ap.gov.in వెబ్ సైట్ ని సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు.

# పిట్ట కొంచెం..! కూత ఘనం.!!

**ముంచంగి పుట్టు ప్రజలకి చేరువ ప్రతినిధి**



ఈ పాప పేరు కిముడు మానస. అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం రాములు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ఒకటో తరగతి చదువుతోంది. అనగ ననగ రాగ మతిశయించునుండు ,తినగ తినగ వేము తియ్యనుండు పద్యాన్ని తట్టిందే తడవుగా అవలీలగా పాడేసింది. చరణం పొల్లు పోకుండా దారాళంగా వల్లిస్తూ శభాష్ అనిపించింది. పాఠశాల కు ఈమధ్యే కొత్తగా వచ్చిన స్థానిక ప్రధానోపాధ్యాయులు గౌ. పల్లుల లింగన్న గారు పిల్లలు చే వేమన ,సుమతీ పద్యాలను రోజూ సాధన చేయిస్తున్నారు. చిన్నారుల్లో గ్రహణం శక్తి ఎక్కువగా ఉంటుందనడానికి ఈ చిట్టి తల్లి గానమే ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అతి తక్కువ కాలంలోనే అభ్యసన సామర్థ్యాలు పిల్లల నుంచి వెలికి రావడం తనకెంతో సంతోషాన్నిస్తోందని ఆ చిన్నారిని చూసి మురిసిపోవడం ఆ మాష్టారు వంతైంది.

# ఎమ్మెల్యే విజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసిన తెలుగు మహిళ

**చీమకుర్తి ప్రజలకి చేరువ ప్రతినిధి**



ఒంగోలులో మంగమూరు రోడ్డులో సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో శాసనసభ్యులు బి. ఎన్. విజయ్ కుమార్ ని నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురా లు గంగుల శివ పార్వతి, కాట్రగడ్డ రమణయ్య , ఎంపీటీసీ దుర్గభవాని , ఏఎంసీ డైరెక్టర్ శ్రీలత , మిరియాల రవణమ్మ , ఝాన్సీ , చావబత్తిన వెంకటేశ్వర్లు తెలుగు మహిళలు మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ అభివృద్ధిపై చర్చించారు.

# ప్రైవేట్ ట్రావెల్ బస్సులు తనిఖీ చేసిన అధికారులు



**దర్శి ప్రజలకి చేరువ ప్రతినిధి**

మోటార్ వాహనముల తనిఖీ అధికారి పి రవికుమార్ సోమవారం రాత్రి పామూరులో ప్రైవేట్ ట్రా వెల్స్ బస్సులను ఆకస్మిక తనిఖీలు చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా తిరుగుతున్న పాండిచ్చేరి రిజిస్ట్రేషన్ ఉన్న బస్సులో అత్యవసర ద్వారం, ముందు బర్త్ ఉండటం తో దాన్ని సీజ్ చేసి పామూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. అదేవిధంగా పామూరు నుంచి తిరుగుతున్న అన్ని ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి బస్సులో అత్యవసర ద్వారం వద్ద ఎలాంటి సీట్లు ఉండరాదని, అగ్ని మాపకసిలెండర్ల పనితీరును పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి వాహన పత్రాలు సక్రమంగా లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇంటి పన్నులు అక్రమాలపై సమగ్ర ధర్యాప్తు జరిపించాలి

**దేవరాపల్లి ప్రజలకి చేరువ ప్రతినిధి**

దేవరాపల్లి పంచాయితీలో ఇంటి పన్నులు వసూళ్లులో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్ర మైన దర్యాప్తు జరిపించి అవినీతికి పాల్పుడిన వారిపై. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న ఎంపిడివో కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ లో పిర్యాదు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. మునగ పాక నుంచి దేవరాపల్లికి బదిలీ పై వచ్చిన బిల్ కలెక్టర్ దేవరాపల్లి గ్రామ ప్రజల కష్టాన్ని అదికార పార్టీ నాయకులు అండ దండలతో ఇంటి పన్నులు రూపంలో వసూళ్ళు చేసుకుని ప్రభుత్వానికి చెల్లించ కుండా స్వాహాచేసారని మంఢి పడ్డారు ఇందులో ఇతర సిబ్బంది హస్తం ఉన్నట్లుగా స్పష్టంగా అర్ద మౌతుందని తెలిపారు ఈ విషయమై పత్రికల్లో భహటాంగా వార్తలు వచ్చిన అదికార పార్టీ నాయకులు అండ దండలు ఉండడంతో ఈ బాగోతం పై ఎటువంటి విచారణ జరప లేదని తెలిపారు బిల్ కలెక్టర్ రికార్డులు,బీరువా తాళాలను సైతం నేటి వరకు అప్పగించ లేదని అన్నారు వాటిని స్వాధీనం చేసుకు నేందుకు స్థానిక పంచాయతీ ఈవో చేసిన ప్రయత్నాలు ఫలించ లేదన్నారు గత ఎడాది ఇంటి పన్ను సొమ్ము రూ. 6 లక్షలే జమ చేసారని దేవరాపల్లి పంచాయతీలో గత ఆర్థిక సంవత్సరం రూ. 13 లక్షల మేర ఇంటి పన్ను వసూళ్ళు కావాల్సి ఉండగా గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది మే 25 వ తేదీ వరకు రూ. 6 లక్షలు మేర మాత్రమే బ్యాంక్ లో జమ అయ్యాయి మిగిలిన సొమ్ములో ఎంత మేర వసూలు అయ్యిందో సమగ్రమైన దర్యాప్తు జరిపితే తప్ప పూర్తి స్థాయిలో స్పష్టత రాదన్నారు పంచాయతీలో ఇప్పటికే ఇరిగేషన్ భూములకు గ్రామ కంఠాలకు ఇంటి నిర్మాణం అనుమతులు పేరిట పెద్ద ఎత్తున కొందరు అన ధికారికంగా వసూళ్లకు పాల్పుడుతున్నారని తెలిపారు గతంలో కూడా బాత్ రూములు కుంభకోణంలో పంచాయతీ ఇ ఓ సస్పెండ్ అయ్యారని ఇలా ఎంతో మంది అదికార పార్టి నాయకులు చేతుల్లో అదికారులు బలై పోతున్నారనని ఆవేదన వ్యక్తంచేశారు ఈలాంటి పరిస్థితి ల్లో తాజాగా వెలుగులోకి వచ్చిన ఇంటి పన్నులు వసూళ్ల అవినీతి ఆరోపణలతో పంచాయతీలో సర్వత్రా చర్చనీయాంశంగా మారిందనని దీన్ని అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేపడితే అవినీతి అక్రమాలు బైట పడతాయని తెలిపారు విటితో పాటు 2024- 2025 ఆర్థిక సంఘం నిదుల్లో కూడా అవినీతి బట్ట బైలు అవుతుందని అన్నారు దీంతో ఇంటి పన్నులు వసూళు లో జరిగిన. అవినీతి అక్రమాళ్ళు పై అన్ని కోణాల్లో సమగ్ర మైన దర్యాప్తు జరిపి నిగ్గు తేల్చి దోషులను కఠినంగా శిక్షించాలని పిర్యాదు లో వెంకన్న డిమాండ్ చేశారు.



# నగదు విత్ డ్రా మోసాలపై అవగాహన





**కనిగిరి ప్రజలకి చేరువ ప్రతినిధి**



ఆధార్ కార్డుతో నగదు విత్ డ్రా చేసే సందర్భాల్లో జరుగుతున్న మోసాలపై పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కనిగిరి డి.ఎస్.పి పి సాయి ఈశ్వర్ యశ్వంత్ , కనిగిరి సీఐ షేక్ ఖాజావలి , పామూరు సిఐ ఎం శ్రీనివాసరావు , కనిగిరి ఎస్ ఐ టి శ్రీరాం , వెలిగండ్ల ఎస్సై కృష్ణ పావని , హెచ్ ఎం పాడు ఎస్సై మాధవరావు , పామూరు ఎస్సై కిషోర్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్లో కామన్ సర్వీస్ సెంటర్ ఆపరేటర్లు, ఆధార్ కార్డుతో డబ్బు విత్ డ్రా చేసే సెంటర్ల ఆపరేటర్లు, ప్రైవేటు , ప్రభుత్వ బ్యాంకుల ఆధీనంలో పనిచేసే లోన్ రికవరీ ఏజెంట్లతో కనిగిరి పోలీస్ స్టేషన్ ఆవరణలో సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ప్రస్తుతం ఆధార్ కార్డుతో మరియు ఇతర గుర్తింపు కార్డులతో డబ్బులు విత్ డ్రా చేసే సందర్భాల్లోజరుగుతున్న మోసాలు, లోన్ రికవరీ ఏజెంట్లు నిర్వహించు విధుల గురించి అవగాహన కల్పించి అందరూ చట్ట ప్రకారం విధులు నిర్వహించవలెనని అట్లా కానీ ఎడల పోలీసులు తీసుకుని చట్టపరమైన చర్యలకు పూర్తి బాధ్యులు కాగలరని అవగాహన కల్పించారు.

# చోడవరంలో ఈనెల 5న మెగా జాబ్ మేళా

- గోడ పత్రికను ఆవిష్కరించిన కలెక్టర్

**అనకాపల్లి ప్రజలకి చేరువ ప్రతినిధి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా నవంబర్ 5 న బుధవారం ఉదయం 9 గంటలకు చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు సుమారు 17 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మెగా జాబ్ మేళా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఈ మెగా జాబ్ మేళాకు సుమారుగా 17 బహుళ జాతీయ కంపెనీలు 1500 ఖాళిలతో హాజరావుతున్నారని ఈ ఇంటర్వ్యూలకు పదవ తరగతి, ఐ టి ఐ, డిప్లొమా, డిగ్రీ మరియు పి జి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరముల వయస్సు గల యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరములను %ఝఙజాబఅఝఎ.ఖజా.స్త్రశీజ.ఙఅ% వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా ఎక్కువ రెస్యూమేలు, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్ లతో ఉదయం 9 గంటలకు జాబు మేళా జరుగు ప్రదేశానికి హాజరు కాగలరు. మరిన్ని వివరములకు 9494791935/ 7981102224 ఫోన్ నంబర్లను సంప్రదించగలరని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ ఎన్. గోవిందరావు ఇంచార్జి డి అర్వో ఎస్ సుబ్బాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

# టిడిపి తీర్థం పుచ్చుకున్న వైసిపి కౌన్సిలర్





**కనిగిరి ప్రజలకి చేరువ ప్రతినిధి**

పార్టీలో కొనసాగలేక పార్టీని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు వైసిపి కౌన్సిలర్. కనిగిరి మునిసిపాలిటిలో వైసిపిని వీడిన కౌన్సిలర్ 6వ వార్డు కౌన్సిలర్ పోతిరెడ్డి రాజారెడ్డి తో పాటు 15 కుటుంబాలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే డా : ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వారికి స్వాగతం పలికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నేతలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోతిరెడ్డి మాట్లాడుతూ కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న గుర్తింపు లేదని పార్టీలో అనేక రకాలుగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజా వ్యతిరేక విధానాలను అమలుపరుస్తున్నారని అందుకే పార్టీని వీడి ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న పార్టీలోకి చేరుతున్నట్లు తెలిపారు. టిడిపి పార్టీ అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందే విధంగా తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# వృత్యంతర శిక్షణ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు

**కనిగిరి : ప్రజలకి చేరవ**



విద్యార్థులకు చిన్న తరగతులనుండి వృత్యంతర శిక్షణను ఇవ్వడం ద్వారా వారికి జీవితంలో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కనిగిరి బాలికోన్నత పాఠశాల నందు తొమ్మిది పదవ తరగతి చదువు తున్న బాలికలకు వృత్యంతర శిక్షణలో భాగంగా వ్యాపార రంగానికి, శరీర సౌందర్యానికి సంబందించిన నైపుణ్య శిక్షణా నమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిద రకాలైన చార్టులు,పరికరాలు, నమూనా ఉపకరణాలను తయారు చేసి ప్రదర్శించారు. అతి తక్కువ సమయంలో విద్యార్థినిలు తయారు చేసిన అంశాలు, వాటి పట్ల విద్యార్థినులకు ఉన్న అవగాహను చూసి పాఠశాల ప్రధానోపాద్యురాలు అభినందించారు. ఈ పాఠశాల నందు గత సంవత్సరం పియంశ్రీ విభాగంలో ఐటి, బ్యూటీషియన్, రిటైల్ విభాగాల్లో వృత్యంతర శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించారు. తొమ్మిది, పది తరగతుల విద్యార్థినులు పాఠ్యాంశాలతో పాటు ఈ శిక్షణను అదనంగా నేర్చుకుంటారు. పదవ తరగతిలో పబ్లిక్ పరిక్షలతో పాటు వీటికి కూడా పరిక్షలకు నిర్వహించి సర్టిఫికేట్లను మంజూరు చేస్తారు. ఈ కార్యక్రమంలో వకేషనల్ శిక్షకులు ఆదినారాయణమ్మ, ఝాన్సిలతో పాటు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.